

## మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

ఉద్యమ కెరటం, తాండూర్: మాదారం సమీపంలో మూతబడిన గని ఎంకేవీ3 ఇంక్లెయిన్ బంకర్ వద్ద అక్రమంగా మట్టి తరలిస్తున్నమూడు ట్రాక్టర్లను శుక్రవారం పట్టుకున్నట్లు బెల్లంపల్లి ఏరియా సెక్యూరిటీ అధికారి శ్రీధర్ తెలిపారు. మట్టిని ట్రాక్టర్లలో లోడ్ చేస్తుండగా మొబైల్ టాస్క్ ఫోర్స్ గమనించినట్లు తెలిపారు. సింగరేణి ఎస్ అండ్ పీసీ సిబ్బందిని చూసి ట్రాక్టర్లను వదిలిపెట్టి పారిపోయేందుకు ప్రయత్నించినట్లు పేర్కొన్నారు. సిబ్బంది వారిని చాకచక్యంగా పట్టుకొని మూడు టాక్టర్లను మాదారం పోలీస్ పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు తెలిపారు. ఇందులో ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీధర్, జూనియర్ ఇన్‌స్పెక్టర్ రాజమౌళి, స్పెషల్ టీం సిబ్బంది సార్ల రమేష్, ఎం శ్రీనివాస్, సీహెచ్ అనిల్ కుమార్, దశరథ్, జె మేదార్, రాయలింగు, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

## పిల్లల ఎదుగుదలపై అవగాహన కల్పించాలి



**ఉద్యమ కెరటం, తాండూర్:** అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఎదుగుదలపై అంగన్వాడీ టీచర్లు వారి తల్లులకు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కర్ర రమాదేవి అన్నారు. శనివారం మండలంలోని రేచిని రైల్వే స్టేషన్ అంగన్వాడీ కేంద్రంలో బాలల సంరక్షణ విద్య కార్యక్రమాన్నినిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల పెరుగుదలపై అంగన్వాడీ టీచర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. 5 సంవత్సరాల వరకు వారి పెరుగుదల, కార్యకలాపాలను నిశితంగా పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. ఐదేళ్ల వరకు పిల్లల మెదడు 80 శాతం పెరుగుతుందని, ఈదశ ఎంతో కీలకమన్నారు. ఈ సమావేశంలో అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మండలి వద్ద అన్నదానం



**ఉద్యమ కెరటం, తాండూర్:** గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తాండూర్ మండల కేంద్రంలోని ఐబీ శ్రీ గణేష్ మండలి వద్ద శనివారం నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాలను స్వీకరించారు.

## కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండలంలోని దుకాణదారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై సర్తాజ్ పాషా అన్నారు. శనివారం పోలీస్ స్టేషన్ లో దుకాణ యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూనేరాల నియంత్రణ కోసం సీసీ కెమెరాలు తప్పనిసరి అని తెలిపారు. ప్రతి షాప్ వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, ప్రజల భద్రత కోసం ఇవి ఎంతగానో దోహద పడతాయన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో తమ బాధ్యతగా దుకాణ సముదాయాల వద్ద యజమానులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో మండల కేంద్రంలోని దుకాణదారులు, యజమానులు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంగిస్తే చర్యలు



**ఉద్యమ కెరటం, ఇచ్చోడ:** గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా జరుపుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఇచ్చోడ సీఐ బండారి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఇచ్చోడ సర్కిల్ పరిధిలోని గుడిహత్నూర్, ఇచ్చోడ, నేరడిగొండ, సిరికొండ మండలాల్లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా, సాంప్రదాయబద్ధంగా నిర్వహించేలా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. ఉత్సవాల సమయంలో డీజే, కలర్ పేపర్స్, లేజర్ లైట్లు, మెర్క్యురీ లైట్ల వినియోగం నిషేధించడం జరిగిందని తెలిపారు. నిబంధనల ప్రకారం ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు.

# రైతులకు నష్ట పరిహారం అందించాలి

**ఉద్యమ కెరటం, తాండూర్:** ఇటీవల మండలంలో కురిసిన భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు కోరారు. శనివారం డిప్యూటీ తహశీల్దార్ కల్పన కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తాండూర్ మండల బీఆర్ఎస్ పార్టీ కార్యదర్శి సుబ్బ దత్తుమూర్తి మాట్లాడుతూ మండలంలోని చాలా గ్రామాల్లో వర్షాలతో పంటలు కొట్టుకు పోయినట్లు తెలిపారు. వరి పొలాల్లో గండ్లు పడి కొన్నిప్రాంతాల్లో ఇసుక మేటలు వేశాయని పేర్కొన్నారు. అధికారులు నష్టపోయిన పంటలను పరిశీలించి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే యూరియా కొరత లేకుండా చూడాలన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ సాధ్యం కానీ హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసిందని, వెంటనే హామీలను నెరవేర్చాలన్నారు. లేనియేడల రానున్న



స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పూసాల ప్రణయ్ కుమార్, నాయకులు మొగిలి శంకర్, దత్తాత్రేయ రావు, బోనగిరి చంద్రశేఖర్, మాసాడి శ్రీరాములు, రావుల స్వామి, సాత్ బాబా, ఉప్పుట్ల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## ఓటరు జాబితాపై అఖిలపక్ష సమావేశం

**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం ఓటరు జాబితాపై అఖిలపక్షం సమావేశం నిర్వహించినట్లు ఎంపీడీఓ ప్రవీణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వెంకటేష్ దోత్రే పర్యవేక్షణలో మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఓటరు జాబితా, పోలింగ్ బూత్ ల వారీగా వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు చూపించడం జరిగిందన్నారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పక్షాలు అధికారులకు సహకరించాలని కోరారు. ప్రతి గ్రామపంచాయతీలో వార్డుల వారీగా ఓటరు జాబితాను పంపిణీ చేయడం జరిగిందని, గత రెండు రోజుల నుంచి ప్రచురణార్థం ప్రజల సౌకర్యం కోసం నోటీసుబోర్డుపై గ్రామపంచాయతీల వారిగా వాటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా రాసి ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీఓ గౌరీశంకర్, ఏపీఓ రాజయ్య, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయుడి సేవలు మరువలేనివి

**ఉద్యమ కెరటం, సిర్పూర్(టి):** ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ సేవలు మరువలేనివని ఎంఈఓ వేణుగోపాల్ అన్నారు. శనివారం మండలంలోని లోనవెల్లి ఎంపీపీఎస్ బాలికల పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు అవధూత చంద్రశేఖర్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్నిఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వేణుగోపాల్ మాట్లాడుతూ చంద్రశేఖర్ లోనవెల్లి పాఠశాలలో 14 నెలలుగా సేవలు అందించారన్నారు. పాఠశాలలో బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ఆయన విద్యార్థుల చదువుకు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ప్రత్యేక తరగతులు నిర్వహించి గురుకుల పాఠశాలలో జిల్లా స్థాయి ప్రథమ ర్యాంక్ వచ్చేలా కృషి చేశారని తెలిపారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాందేవ్, ముజాకీర్, జమున, జయశ్రీ, సునీత, అర్చన, విజయలక్ష్మి, సీఆర్పీ పవన్, రాజేష్, ప్రశాంత్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు పరిహారం చెల్లించాలి

**ఉద్యమ కెరటం, కామారెడ్డి జిల్లా ప్రతినిధి:** భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు హన్మంత్ షిండే, జాజుల సురేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జుక్కల్ నియోజకవర్గంలోని పలు గ్రామాలు వరద నీటితో ముంపుకు గురికాగా ముంపు ప్రాంతాలను సందర్శించి వరద బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరద బాధితులకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం పూర్తిగా బాధ్యత వహించి నష్టపరిహారం చెల్లించాలన్నారు. పంట నష్టం జరిగిన రైతులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారులతో పంట నష్టం అంచనా వేయించి వరద బాధితులకు, రైతులకు నష్ట పరిహారాన్ని చెల్లించాలని పేర్కొన్నారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. వారి వెంట ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజుల సురేందర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువ నాయకులు తదితరులు ఉన్నారు.





## అధికారులకు బదిలీలు సహజమే

**జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే**

**ఉద్యమ కెరటం, కామారెడ్డి:** అధికారులు బదిలీలు సహజమేనని, ప్రజల కోసం పనిచేసిన వారికి గుర్తింపు లభిస్తుందని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్ మండలం పంచాయతీరాజ్ ఉపకర్య నిర్వాహక ఇంజనీర్ గా పనిచేసిన అమ్మాపురం రవీంద్ర బాబు శనివారం ఉద్యోగ విరమణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విధి నిర్వహణలో రవీంద్ర అందరిని ఆప్యాయంగా పలకరించేవారని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు, అధికారులతో మమేకమై విధులు నిర్వర్తించినట్లు పేర్కొన్నారు. అనంతరం ఆయనను శాలువ, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ నియోజకవర్గంలోని అన్ని మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# చిన్ననాటి నుంచే ఆరోగ్య నియమాలు పాటించాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** చిన్ననాటి నుంచే ఆరోగ్య నియమాలు పాటించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం భోరజ్ మండలంలోని గిమ్మా గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శుభ్రత, పౌష్టికాహారం, వ్యాయామం వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మానసిక, శారీరక ఆరోగ్యం మన భవిష్యత్తును నిర్ణయిస్తాయని, విద్యతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని కోరారు. ఆరోగ్యపరంగానే కాదు, వ్యక్తిత్వ వికాసం, మానసిక వికాసం కూడా విద్యార్థుల అభివృద్ధికి అత్యంత అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు పాఠశాలలో అభ్యసించే ప్రతి విషయం వారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే అవకాశంగా మారాలన్నారు. సానుకూల ఆలోచన, ఆత్మవిశ్వాసం, సామూహిక వ్యవహార శైలీ వంటి అంశాలు మానసిక వికాసానికి మార్గం వేస్తాయన్నారు. కాగా విద్యార్థులు ఆరోగ్యంపై ప్రదర్శనలు నిర్వహించగా, మానసిక ఆరోగ్యంపై ఉపన్యాసాలు, చర్చలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పద్మజ, రిసోర్స్ పర్సన్ అజయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





# వివాహిత అదృశ్యం కేసులో మరో మలుపు!



### భర్త వీడియో విడుదల తర్వాత భార్య స్పందన
### భర్త వేధించడంతోనే వెళ్లిపోయినట్టు వివరణ
### తాను ఎప్పటికీ తిరిగి రానని తేల్చి చెప్పిన మహిళ

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ ప్రతినిధి :** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ గా పని చేస్తున్న వివాహిత అదృశ్యం కేసు మరో మలుపు తిరిగింది. ఈ నెల 26న భర్త ఫిర్యాదు మేరకు రెబ్బెన పోలీసులు కేసు నమోదు చేయగా, శుక్రవారం సాయంత్రం ఆ మహిళ ఓ వీడియోను విడుదల చేసింది. అందులో తన భర్త, కుటుంబ సభ్యులు మానసికంగా, శారీరకంగా హింసించడంతో తాను ఓ స్నేహితుని ద్వారా ఆసుపత్రికి వెళ్లినట్లు వీడియోలో పేర్కొంది. తన భర్త విడుదల చేసిన వీడియోలో పేర్కొన్న విధంగా తాను అదృశ్యం కాలేదని, తనను శారీరకంగా హింసించడంతో అనారోగ్యానికి గురైనందున స్నేహితుని సహాయం కోరడంతో అతను మానవతా దృక్పథంతో తనకు సహాయం చేసినట్లు వివరించింది. తన భర్త, కుటుంబ సభ్యులతో తనకు ప్రాణహాని ఉన్నదని పేర్కొన్నది. కాగా, 26న తన భర్త, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు తర్వాత తాను రెబ్బెన పోలీస్ స్టేషన్ కు ఫోన్ చేసి, తాను ఎటూ వెళ్లలేదని, అదృశ్యం కాలేదని సమాచారం ఇచ్చినట్లు వీడియోలో పేర్కొన్నది. కానీ, అదే రోజున పోలీసులు మహిళా అదృశ్యం కేసు నమోదు చేసిన విషయం ఆశ్చర్యానికి గురి చేసిందని చెప్పింది. తాను తిరిగి రానని, తిరిగి వచ్చేది లేదని వీడియోలో స్పష్టం చేసింది. కాగా, భర్త రమేష్ చెబుతున్న విషయానికి ఆ వివాహిత చెబుతున్న విషయానికి పొంతన కుదరడం లేదని తెలుస్తున్నది. ఉన్నత అధికారి వద్ద క్యాంపు క్లర్క్ గా పని చేస్తున్న వ్యక్తికి ఈ కేసులో నేరుగా సంబంధం ఉండడంతో పోలీసులు కేసును పక్కదారి పట్టిస్తున్నారని జనం కోడై కూస్తున్నది. ఉన్నతాధికారి క్యాంపు క్లర్క్ ఈ వివాహితను మాయ మాటలు చెప్పి ఆమెను ట్రాప్ చేశాడని భర్త తెలుపుతుంటే, అందుకు విరుద్ధంగా ఆమె వీడియో విడుదల చేయడం వెనుక ఏం జరిగి ఉంటుందో అర్థం చేసుకోవచ్చని స్థానికులు గుసగులాడుకోవడం వినిపిస్తున్నది. ఇందులో భారీ మొత్తంలో డబ్బులు ఉండడం.. చిరు ఉద్యోగుల వద్ద ఇంత భారీ స్థాయిలో డబ్బు ఉండటమేమిటనే ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. అంతేకాకుండా తన భార్య అదృశ్యమైనప్పుడు చాలా పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకువెళ్లినట్లు భర్త ఆరోపిస్తున్నాడు. మహిళా అదృశ్యం కేసు ఇంకెన్ని మలుపులు తీసుకోనున్నదోనని సహ ఉద్యోగులు గుసగుసలాడుతున్నారు.

# వక్ఫ్ భూమి స్వాధీనమయ్యేలా చొరవ తీసుకోండి



### మైనార్టీ కమిషన్ చైర్మన్‌కు ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు వినతి

**ఉద్యమ కెరటం, కరీంనగర్:** కొత్తపల్లి హావేలి మండలంలోని ఖాజీపూర్ వక్ఫ్ బోర్డు కు సంబంధించిన, కోట్లాది రూపాయల విలువ చేసే 55ఎకరాల భూమిని, కబ్జాదారుల నుండి వక్ఫ్ బోర్డు వశమయ్యేలా చొరవ తీసుకోవాలని, ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీకి విజ్ఞప్తి చేశారు. శనివారం కరీంనగర్ పర్యటనకు వచ్చిన మైనారిటీ కమిషన్ చైర్మన్ తారీఖ్ అన్సారీనీ ఆర్ అండ్ బి గెస్ట్ హౌజ్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గులాం అహ్మద్ మాట్లాడుతూ.. అన్యాక్రాంతం అయిన ఖాజీపూర్ వక్ఫ్ భూమిని విచారణ జరిపి స్వాధీనం చేసుకోవాలని, లెటర్ ఇచ్చిన నేపథ్యంలో, విచారణ పూర్తయినప్పటికీ అట్టి భూమి స్వాధీనాన్ని ఆచరణలో అమలు చేయాలని కోరారు. వక్ఫ్ యాక్ట్ 1990 గెజిట్ ప్రకారం ఖాజీపూర్ రెవెన్యూ పరిధిలోని 122, 126, 129, 154, 171 సర్వే నెంబర్లలో 55ఎకరాల 22గుంటల భూమి వక్ఫ్ బోర్డ్ దేనని తేలిందన్నారు. ఈవక్ఫ్ భూమిలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, దర్జాగా ఫామ్ హౌస్ నిర్మించుకొని వక్ఫ్ భూమిని అనుభవిస్తున్నారని వివరించారు. వక్ఫ్ భూమిని ఆధీనంలో ఆధీనంలో ఉంచుకోవడమే కాకుండా ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగుతూ అదే ప్రభుత్వం మీద హైకోర్టులో కేసు వేసిన చరిత్ర గంగుల కమలాకర్ దేనన్నారు. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వం లోనైనా కరీంనగర్ ముస్లిం సమాజానికి పూర్తిస్థాయిలో మేలు జరగాలంటే ఖాజీపూర్ వక్ఫ్ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసిన వక్ఫ్ భూమిని రిజిస్ట్రేషన్లు రద్దు చేసేట్లు జిల్లా కలెక్టర్కు ఆదేశాలు జారీ చేయాలని కోరగా సానుకూలంగా స్పందించిన మైనారిటీ కమిషన్ చైర్మన్ అన్సారీ ఖాజీపూర్ వక్ఫ్ భూమి అంశంలో రిజిస్ట్రేషన్లు రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను మౌఖికంగా ఆదేశించినట్లు తెలిపారు.

# యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు

### జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్



**ఉద్యమ కెరటం, కామారెడ్డి జిల్లా ప్రతినిధి:** కురిసిన భారీ వర్షాలతో ఇండ్లలోకి వరద ముంచెత్తిన కామారెడ్డి పట్టణంలోని జీఆర్ కాలనీలో శనివారం జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ పర్యటించారు. కాలనీలో చేపడుతున్న పారిశుధ్య పనులు, తాగునీరు, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కార్యక్రమాలను పరిశీలించారు. వరద ప్రభావంతో పాక్షికంగా దెబ్బతిన్న కాలనీలోని 48 ఇండ్లకు తక్షణ సహాయంగా రూ.11500 ఆర్థిక సహాయంతో పాటు ఇతర నిత్యావసర వంట సరుకులు, దుప్పట్లను అందించేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ల్లా కలెక్టర్ మాట్లాడుతూ జీఆర్ కాలనీలో యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి ఇంటికి విద్యుత్ కనెక్షన్ చెక్ చేయడం జరిగిందని, వెంటనే విద్యుత్ పునరుద్ధరణ చేస్తామని తెలిపారు. మున్సిపల్, ఫైర్, పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ శాఖల సమన్వయంతో పాటు వాలంటీర్ల ద్వారా పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. కాలనీలో త్వరలో సాధారణ పరిస్థితి నెలకొంటాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా దెబ్బతిన్న రహదారులు, విద్యుత్, నీటిపారుదల వనరులు తదితర పనులను తాత్కాలికంగా, శాశ్వత పద్ధతిలో చేపట్టుతున్నామని పేర్కొన్నారు. పంట నష్టం వివరాలను వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా సర్వే చేస్తున్నామని వివరించారు. కలెక్టర్ వెంట జిల్లా అదనపు కలెక్టర్ బాడీస్ చందర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్, తహశీల్దార్ జనార్ధన్, విద్యుత్, ఆర్ అండ్‌బీ, తదితర శాఖ అధికారులు ఉన్నారు.



# పోలీసుల మరువలేనివని

**ఉద్యమ కెరటం కామారెడ్డి జిల్లా ప్రతినిధి:** విధి నిర్వహణలో భాగంగా సుదీర్ఘకాలం పోలీసు శాఖలో సేవలందించడం అభినందనీయమని జిల్లా ఎస్పీ ఎం రాజేష్‌చంద్ర అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్సై ఎండి యూసుఫ్, ఏఆర్ ఎస్సై కె చంద్రశేఖర్ లను శనివారం కుటుంబ సమేతంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని అన్నారు. విధి నిర్వహణలో భాగంగా కుటుంబానికి దూరంగా ఉంటూ ఎన్నోత్యాగాలతో ప్రజలకు సేవలు అందించడం గర్వకారణమని కొనియాడారు. పోలీసు శాఖలో అందించిన సేవలు మరువలేనివని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సంతోష్, నవీన్ కుమార్, కుటుంబ సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.



# మర్కజి మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో గులాం అహ్మద్ కు సన్మానం

**ఉద్యమ కెరటం, కరీంనగర్:** నగరంలోని పురాతన మర్కజీ మీలాద కమిటీ కరీంనగర్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి హుస్సేనీపుర బొంబాయి స్కూల్ మదర్సా గౌస్ రిఫాయి ఖాలీదే గుల్షన్‌లో మీలాద్ కమిటీ అధ్యక్షుడు ఫరీద్‌బాబా ఆధ్వర్యంలో ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్‌కు ఆత్మీయ సన్మానం జరిగింది. ఈసందర్భంగా గులాం అహ్మద్ మాట్లాడుతూ మీలాద్ ఆధ్యాత్మిక కార్యక్రమాలు మహమ్మద్ ప్రవక్త జీవిత విశిష్టతను ముస్లిం సమాజానికి తెలియపరచడానికి మూలం అవుతాయన్నారు. పరమత సహనం పాటించడానికి మహా ప్రవక్త మహమ్మద్ ఇచ్చిన పిలుపును గుర్తు చేశారు. సెప్టెంబర్ 8వ తేదీన మీలాద్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు ముంబై బాబా ఫరీద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకుడు మాజీ కార్పొరేటర్ ఆరిఫ్ అహ్మద్, నాయకులు ఖాజా మజహరోద్దీన్, తాజ్, అసద్, జమీల్, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి బోరంచు పరామర్శ



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తిగత సహాయకులు జైపాల్ రెడ్డి తండ్రి రామచంద్ర రెడ్డి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్నతెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి శనివారం మహబూబ్ నగర్ జిల్లా ఉప్పునూతల మండలంలోని తిరుమాలాపూర్ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతి పట్ల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రగాడ సానుభూతి తెలిపారు. ఆయన వెంట సారంగాపూర్ మాజీ జెడ్పీటీసీ పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# వదర బాధితులకు పరామర్శ




**ఉద్యమకెరటం, నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలంలోని గుడిసే ప్రాంతంలో గత మూడు నాలుగు రోజుల నుంచి కురిసిన అతి భారీ వర్షానికి ప్రజలు, వ్యాపారులు భారీగా నష్టపోయారు. ఈ విషయాన్ని తెలుసుకున్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే, ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ దఫెదర్ రాజు బొగ్గు గుడిసే ప్రాంతానికి చేరుకొని బాధిత సభ్యులను శనివారం పరామర్శించారు. అధైర్య పడవద్దని, ధైర్యంగా ఉండాలని అన్నారు. ఆ ప్రాంతంలో హొటాళ్లు, కిరాణం దుకాణాలు, టైర్స్ షాప్స్, ఇతర వ్యాపార సంస్థలు భారీ వర్షాలతో సామాగ్రి వాగులో కొట్టుకపోయి తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. వారి వెంట మండల అధ్యక్షుడు సాదుల సత్యనారాయణ, మండల సీనియర్ నాయకుడు దుర్గారెడ్డి, మాజీ సిడిసి చైర్మన్ గంగారెడ్డి, వైస్ ఎంపీపీ మనోహర్, రమేష్ గౌడ్, సొసైటీ చైర్మన్లు వాజిద్ అలీ, నరసింహారెడ్డి, మాజీ సర్పంచులు లింగాల రామచందర్, సంగమేశ్వర్ గౌడ్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ నాయక్, లక్ష్మారెడ్డి, రాజేశ్వర్ గౌడ్, రామ గౌడ్, జీవన్, మహేందర్, మాలిష్ రాజు, మిడత సాయిలు, అఫ్జల్, రాజేశ్వర్, రాములు, బలరాం, బషీర్ తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** మచ్చాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కొలాంగూడ, మారుతిగూడ గ్రామస్తులు బీఆర్ఎస్ పార్టీ నుంచి శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు గ్రామస్తులు ఢోలు వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ ఆదివాసీ గిరిజన సంప్రదాయంలో ఆడే గజేందర్ కు స్వాగతం పలికారు. అనంతరం ఆడే గజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆదివాసీలను అక్కున చేర్చుకుందని, ఆదివాసీలంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక గౌరవం అని తెలిపారు. తెలంగాణలోని ప్రతి గూడెం, తండాల్లో అభివృద్ధే లక్ష్యంగా ప్రజా పాలనను కొనసాగిస్తున్నారని అన్నారు. ఏ అవసరం ఉన్నా ఎల్లపుడు తాను అందుబాటులో ఉంటానని, సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఆడే శీల, గుడిహత్నూర్ మాజీ ఎంపీటీసీ అంకత్ రవి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు విష్ణుకాంత్, సీనియర్ నాయకులు రాథోడ్ రమేష్, బాలాజీ పటేల్, శాసనే మాధవ్, మహేందర్, నరేష్, శివాజీ, గణేష్, శ్రీకర్ గౌడ్, శంకర్, రాజు, సమీర్, రామదాసు ముండే, తదితరులు పాల్గొన్నారు.



## వరద బాధితులను ఆదుకోవాలి

**ఉద్యమ కెరటం, డోంగ్లీ:** వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజు, మాజీ ఎమ్మెల్యే అరుణ తార అన్నారు. భారీ వర్షాలతో డోంగ్లి మండలంలో జరిగిన పంట నష్టం, వరద బాధితుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని శనివారం సందర్శించారు. సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం వరద బాధితును అన్నివిధాలుగా ఆదుకోవాలన్నారు. డోంగ్లీ మండల కేంద్రంలోని పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్నిసందర్శించి పరామర్శించారు. పునరావాస కేంద్రంలో వరద బాధితులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని తహశీల్దార్ కు తెలిపారు. వారి వెంట బీజేపీ నాయకులు అరుణ్ పటేల్, రేవంత్, రామగౌడ్, సచిన్, కార్యకర్తలు ఉన్నారు.

## భక్తి మార్గంతోనే ప్రశాంతత



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** భక్తి మార్గం తోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మంచిర్యాల ఆర్డీఓ శ్రీనివాసరావు అన్నారు. మంచిర్యాలలోని వంద ఫీట్ల రోడ్డు వద్ద అంజనీ పుత్ర సంస్థ కార్యాలయం ప్రాంగణంలో గల గణ నాథునికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 3వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తి మార్గంలో పయనించి సమాజంలో మార్పు తీసుకురావాలన్నారు. అంజనీ పుత్ర సంస్థ చైర్మెన్ గుర్రాల శ్రీధర్, మేనేజింగ్ డైరెక్టర్ పిల్లి రవిలు మాట్లాడుతూ సమాజ సేవ కోసం ఎల్లవేళలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంజనీ పుత్ర సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సూరినేని కిషన్, కాసర్ల సదానందం, డైరెక్టర్ లు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## వరద బాధితులకు ఎంపీ పరామర్శ



**ఉద్యమ కెరటం, డోంగ్లి:** భారీ వర్షాలతో మద్నూర్, డోంగ్లి, మండలాల్లో వరద బాధితులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్టం, జరిగిన రోడ్ల నష్టం, వరద బాధితులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. మద్నూర్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు పునరావాస కేంద్రాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు. వారి సాధక బాధకాల గురించి అడిగి తెలుసుకున్నారు. వరద బాధితులకు జరుగుతున్న ఏర్పాట్లపై సంతోషం వ్యక్తం చేవారు. పునరావాస కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని మండల తహశీల్దార్ కు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## ముగిసిన ఆది కర్మయోగి శిక్షణ




**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండల కేంద్రంలోని అభివృద్ధి కార్యాలయంలో గత రెండు రోజుల నుంచి జరిగిన ఆది కర్మయోగి శిక్షణ తరగతులు శనివారంతో ముగిసినట్లు ఎంపీడీఓ ప్రవీణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెజ్జూర్ మండలంలో ఆది కర్మయోగి పీఎం జూగా కింద నాలుగు గ్రామపంచాయతీలు ఎంపిక కావడం జరిగిందన్నారు. ఎంపికైన గ్రామపంచాయతీల్లోని ఏడు శాఖల అధికారులకు శిక్షణ కల్పించినట్లు పేర్కొన్నారు. అనంతరం శిక్షణ పొందిన అధికారులకు ధృవపత్రాలను అందజేశారు. ఆది కర్మయోగి అనేది కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రారంభించిన ఒక కార్యక్రమమని, గిరిజన ప్రాంతాల్లో అట్టడుగు స్థాయిలో పాలనను మెరుగుపర్చడం, 20 లక్షల మంది గిరిజన నాయకులను తీర్చిదిద్దడం దీని లక్ష్యమని అన్నారు. గిరిజన సంక్షేమాన్ని మెరుగుపర్చడానికి, వికసిత్ భారత్ 2047 లక్ష్యాలను సాధించడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సునీత, ఏపీఎం మోహన్ దాస్, ఏపీఓ రాజయ్య, ఎంపీఓ గౌరీశంకర్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ అభిలాష్, ఫారెస్ట్ ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పూలాజీ బాబా ప్రవచనాలు స్ఫూర్తిదాయకం

### ఆదిలాబాద్ ఎంపీ గొడం నగేష్



**ఉద్యమ కెరటం, జైనూర్:** శ్రీ శ్రీ శ్రీ సద్గురు పూలాజీ బాబా ప్రవచనాలు, ధ్యాన బోధనలు స్ఫూర్తిదాయకమని ఆదిలాబాద్ ఎంపీ గొడం నగేష్ అన్నారు. శనివారం జైనూర్ మండలం పాట్నాపూర్ గ్రామంలోని సిద్దేశ్వర సంస్థాన్ లో నిర్వహించిన పూలాజీ బాబా 101వ జయంతి వేడుకలకు జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, జిల్లా ఎస్పీ కాంతిలాల్ సుభాష్, కిన్వట్ నియోజకవర్గ ఎమ్మెల్యే భీమ్ రావు కేరంలతో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలాజీ బాబా చూపిన ఆధ్యాత్మిక, ధ్యాన సన్మార్గాలు ఎంతో గొప్పవని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల్లో బాబా ప్రవచనాలు, బోధనలతో ఎన్నో కుటుంబాలు ఆధ్యాత్మిక మార్గంలో నడుస్తున్నాయని తెలిపారు. సమాజంలో అన్ని వర్గాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి ఆధ్యాత్మిక సన్మార్గాన్ని చూపిన మహనీయుడని కొనియాడారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పూలాజీ బాబా ప్రజల జీవితాల్లో మార్పు రావాలని చేసిన ఆధ్యాత్మిక సేవలు చిరస్మరణీయమని అన్నారు. పూలాజీ బాబా తపస్సు చేసిన దామాజీ లోయకు రోడ్డుతో పాటు మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వ ఆదేశాల మేరకు కృషి చేస్తామని తెలిపారు. పూలాజీ బాబా జయంతి వేడుకలకు హాజరైన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, ఆధ్యాత్మిక మార్గాలపై ఎగ్జిబిషన్ స్టాళ్ల ఏర్పాటు, అధిక సంఖ్యలో భక్తులు హాజరు కావడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం సద్గురు పూలాజీ బాబా జీవిత చరిత్ర, ప్రవచనాల ధ్యాన మార్గాలపై మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ కొటు కులే, భక్తురాలు కమల రచించిన గ్రంథాలను, క్యాసెట్ ను ఆవిష్కరించారు. జయంతి వేడుకల్లో పాల్గొన్న భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర ప్రత్యేక ఉపపాలన అధికారి రాందాస్, ఆదిలాబాద్ డీఎస్పీ రఘునాథ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, ఉట్నూర్ పీవీటీజీ ఏపీఓ మెస్రం మనోహర్, మహారాష్ట్ర మాజీ మంత్రి శివాజీ రావు, మాజీ ఎమ్మెల్యే ఉత్తం రావు ఇంగ్లె, జైనూర్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ రావు, ఉత్తం రావు, ఆదిలాబాద్ గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, ఆసిఫాబాద్ విద్యుత్ శాఖ ఎస్ఈ శేషరావు, సంబంధిత శాఖల అధికారులు, సంఘాల ప్రతినిధులు, సిద్దేశ్వర సంస్థాన్ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.





# వరద పరిస్థితుల దృష్ట్యా ప్రజా రక్షణకు చర్యలు

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిరాల:** భారీ వర్షాల కారణంగా ఏర్పడుతున్నవరద పరిస్థితుల దృష్ట్యా ప్రజల రక్షణ కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల గోదావరి నది తీరంలో మాతా శిశు ఆసుపత్రి, రామ్ నగర్ ప్రాంతంలో వరద పరిస్థితిని డీఎస్పీ ఎ భాస్కర్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సంపత్, ఏసీపీ ప్రకాష్, మండల తహశీల్దార్ రఫతుల్లాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కురుస్తున్నభారీ వర్షాల కారణంగా ఎల్లంపల్లి ప్రాజెక్టు లోనికి 8 లక్షల క్యూసెక్కుల వరద నీరు చేరిందని తెలిపారు. నది తీర ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికార యంత్రాంగం సమన్వయంతో రక్షణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎగువన ఉన్న ఎస్ఆర్ఎస్పి, కడెం ప్రాజెక్టుల నుంచి వరద నీటిని విడుదల చేయడంతో జిల్లాలోని వాగులు, చెరువుల నుంచి అదనంగా వరద నీటిని కలుపుకొని 8 లక్షల క్యూసెక్కుల నీరు ఎల్లంపల్లి ప్రాజెక్టులోనికి ఇన్ ఫ్లో అవుతుందని పేర్కొన్నారు. వరద నీటి కారణంగా మొదట ప్రభావితమయ్యే మాత శిశు ఆసుపత్రి నుంచి గర్భిణీలు, బాలింతలు, పిల్లలను ఇతర ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల నుంచి 27 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించి రక్షణ చర్యలు చేపట్టడం జరిగిందని అన్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని, నివాస ప్రాంతాల్లో వర్షపు నీటి నిల్వలను తొలగించి, దోమల అభివృద్ధిని అరికట్టే దిశగా ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ప్రాంతాల్లో నీటి ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయితీ శాఖల సమన్వయంతో ప్రజా రక్షణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో చేపల వేటకు ఎవరు వెళ్లకూడదని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు చోటు లేకుండా గజఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అత్యవసర పరిస్థితులలో ప్రజలకు తక్షణ సహాయం, సమాచారం అందించేందుకు జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ 08736- 250501 నెంబర్ ఏర్పాటు చేయడం జరిగిందని, 24 గంటలు అందుబాటులో ఉంటూ తక్షణ సహాయం అందించేందుకు సిద్ధంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 420 హామీలతో అధికారంలోకి..



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, 20 నెలలు గడుస్తున్నా గంభరావుపేట మండలానికి ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని సెస్ డైరెక్టర్ గౌరీనేని నారాయణ రావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కోమిరిశెట్టి లక్ష్మణ్, కమలాకర్ రెడ్డి అన్నారు. శనివారం గంభీరావుపేట మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు పాపగారి వెంకటస్వామి గౌడ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో హైలెవెల్ బ్రిడ్జి కేటీఆర్ మంజూరు చేస్తే 20 నెలలు అధికారంలో ఉండి బ్రిడ్జి పనులను చేపట్టకుండా రూ.17 కోట్లు బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం రూ.10కోట్ల 60లక్షలు వెచ్చించి పనులు మాత్రం చేపట్టకుండా అధికారంలో ఉండి కూడా ప్రతిపక్ష పార్టీపై మాట్లాడడం కాంగ్రెస్ పార్టీకి చేతగాని తనమని అన్నారు. ఇప్పటికైనా త్వరితగా అభివృద్ధి పనులను చేపట్టి మండలాన్ని డబుల్ రోడ్డు తో పాటు సుందరీకరణ పనులను చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సింగిల్ విండో డైరెక్టర్ భూపతి సురేందర్, పట్టణ అధ్యక్షుడు వెంకట యాదవ్, దయాకర్ రావు, చీరాల వెంకటస్వామి, గంట్యాడపు రాజు, రాజారాం, రాజేందర్, లింగం యాదవ్, అబ్దుల్ వహీద్, చెవుల మల్లేశం, స్వామి, మాజీ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూ సేకరణ ప్రక్రియ చేపట్టాలి

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** సింగరేణి పరిధిలో భూసేకరణ ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టాలని సింగరేణి సంస్థ సిబ్బంది పరిపాలన, సంక్షేమ విభాగ సంచాలకులు గౌతమ్ పొట్రు అన్నారు. శనివారం జైపూర్ మండల కేంద్రంలో గల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ దీపక్, పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్లు, ఎస్టేట్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి పరిధిలో చేపట్టే భూసేకరణ ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టాలని తెలిపారు. భూ యజమానులు, సింగరేణి సంస్థ సమన్వయంతో వ్యవహరించాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రక్రియ నిర్వహించాలని పేర్కొన్నారు. అంతకుముందు జిల్లాకు విచ్చేసిన సంచాలకులను కలెక్టర్ కుమార్ దీపక్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.



